క్లుప్తంగా

దర్గా పీఠాధిపతిని సన్మానించిన ఎమ్మెల్యే కాటసాని



బనగానపల్లె రూరల్ : ముస్లింల పవిత్ర స్థలమైన బాగ్దాద్, ఉమ్రా యాత్ర వెళ్లి వచ్చిన పట్టణానికి చెందిన జెండేవాలే సాహెబ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్‌హుస్సేని ఖాద్రీ, సయ్యద్ జమీల్ హుస్సేని ఖాద్రీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి దుశ్శాలువా పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అలాగే జెండేవాలే సాహెబ్ దర్గాలోని స్వామి వారికి పూల చాదార్ సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు కూరగాయాల మహబూబ్‌బాషా, అబ్దుల్ ఫైజ్, కలాం, ముక్తార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఏపీఓ ప్రకాష్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఏపీఓ మాట్లాడారు. ఎండ తీవ్రంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, నీరు ఎక్కువగా తాగాలని కూలీలకు ఏపీఓ సూచించారు.

చీరెల పంపిణీ

ప్యాపిలి: స్థానిక జామియా మసీదులో బుధవారం పేద ముస్లిం మహిళలకు చీరెలు, నగదు పంపిణీ చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌ఖాన్, సభ్యులు మహబూబ్ సాహెబ్ ఆధ్వర్యంలో చీరలు అందజేశారు. హైదరాబాదుకు చెందిన ఇస్మాయిల్ కొద్ది సంవత్సరాల క్రితం హైదరాబాదులో స్థిరపడ్డారు. ఇస్మాయిల్‌తో పాటు అతని కుమారుడు జాకీర్ దాతల సహకారంతో ప్రతి సంవత్సరం రంజాన్ మాసం సందర్భంగా పట్టణానికి చెందిన పేద మహిళలకు చీరలతో పాటు పింఛన్లు, పండుగ ఖర్చులకు కొంత నగదు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు గఫూర్, మహబూబ్‌బాష, రషీద్, రహంతుల్లా, తాజుద్దీన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సామాజిక స్పృహ అలవర్చుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి సూచించారు. బుధవారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశాంక్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తబురుజులో ఇంటింటి ప్రచారం



మహిళలతో మాట్లాడుతున్న శ్రీరాములు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తబురుజులో బుధవారం రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డిలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. వైస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ తిరుమల్‌రెడ్డి, నాయకులు మధుసుదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సోమేష్‌యాదవ్, కృష్ణమూర్తి, రంగనాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, తిమ్మయ్య, చిన్న నారాయణ, శ్రీరాములు, విశ్వానాథరెడ్డి పాల్గొన్నారు.

నివాళి

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామానికి చెందిన రిటైర్ట్ ఏఎస్ఐ కొండ్రెడ్డి గురువారెడ్డి(85) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం ఉదయం గ్రామాన్ని చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, ప్రసాదరెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, చిట్రెడ్డి మోహన్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఒక ఇంటిలో నిల్వ ఉంచిన 1,100 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. భరత్‌చంద్ర అలియాస్ చింటూ, ఉదయ్ గుంతకల్లు నుంచి గంజాయి ఇక్కడికి తీసుకవచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని ఆయన తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వీరికి గంజాయి సరఫరా చేసే వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నట్ల సీఐ తెలిపారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మ జాతర ముగిసి 16 రోజులైన సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



కోవెలకుంట్ల : సచివాలయం వద్ద పింఛన్ల కోసం వృద్ధుల నిరీక్షణ



కొలిమిగుండ్ల : సచివాలయం ఎదుట నేలపై కూర్చున్న పింఛన్ లబ్ధిదారులు



బేతంచెర్ల: సచివాలయం వద్ద ఉదయమే వృద్ధుల నిరీక్షణ



డోన్: సచివాలయం వద్ద అలసిపోయి రెప్పవాల్చిన వృద్ధులు

చంద్రబాబు రాజకీయ కుట్ర...

వృద్ధులకు తప్పని అగచాట్లు!

- మూడవ తేదీ అయినా అందని పింఛన్ సొమ్ము
- ఉదయం నుంచే సచివాలయాల వద్ద నిరీక్షించిన అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు తదితర పింఛన్ లబ్ధిదారులు
- అయినా చేకూరని ప్రయోజనం.. నిరాశతో వెనుదిరిగిన వైనం
- బాబుకు శాపనార్థాలు పెట్టిన అభాగ్యులు



బనగానపల్లె : సచివాలయం వద్ద వేచివున్న పింఛన్‌దారులు

బనగానపల్లె : సార్వత్రిక ఎన్నిక నేపథ్యంలో చంద్రబాబు నాయుడు రాజకీయ కుట్రలకు తెరలేపాడు. కుట్రలు, కుతంత్రాల చంద్రబాబు మొదట పింఛన్‌దారులపై స్వచ్ఛంద సంస్థ ముసుగులో నక్కజిత్తులను చాటుకున్నాడు. బాబు పన్నిన కుతంత్రంలో భాగంగా ఓ స్వచ్ఛంద సంస్థ ఫిర్యాదు మేరకు వలంటీర్లను పింఛన్ పంపిణీ చేయకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల అమలు నేపథ్యంలో అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితర పింఛన్ లబ్ధిదారులు అగచాట్లకు గురయ్యారు. దీంతో ఒకటవ తేదీన వలంటీర్ల చేతుల మీదుగా ఠంచన్‌గా పింఛన్ అందుకునే లబ్ధిదారులకు మూడవ తేదీ వచ్చినా నగదు అందలేదు. బుధవారం ఉదయమే పింఛన్ కోసం లబ్ధిదారులు సచివాలయాలు చేరుకుని నిరీక్షించారు. వృద్ధులు, దివ్యాంగుల కష్టాలు వర్ణనాతీతం. ఉదయమే వచ్చిన వృద్ధులు నిరీక్షించి సచివాలయాల వద్దే కునుకుదీరారు. ఎట్టకేలకు సాయంత్రం అరకొరగా పింఛన్ పంపిణీ జరగ్గా చాలామంది నిరాశతో వెనుతిరిగారు. రాజకీయంగా ఎదుర్కోవాలే తప్పా... మాపై ప్రతాపం చూపడం ఎంతవరకు న్యాయం అంటూ బాబుపై అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు తీరును తప్పుపుడుతూ శాపనార్థాలు పెట్టారు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు.

20 శాతం పింఛన్ పంపిణీ జరగని వైనం

అవుకు: చంద్రబాబు రాజకీయ కుట్ర మూలంగా పింఛన్ పంపిణీ మూడు రోజులు ఆలస్యమైంది. బుధవారం ఉదయం నుంచి సచివాలయాల వద్ద నిరీక్షించిన అవ్వ,తాతలు, దివ్యాంగులు, వితంతువులు తదితర లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. పింఛన్ పంపిణీ ప్రక్రియ సచివాలయ సిబ్బంది చేపట్టడంతో కేవలం 20 శాతమే జరిగింది. గతంలో వలంటీర్లు మొదటి రోజు 1వ తేదీనే 80 నుంచి 90 శాతం లబ్ధిదారులకు నగదు ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశేవారు. ఉదయం నుంచి నిరీక్షించినా పింఛన్ అందజకపోవడంతో చంద్రబాబుపై శాపనార్థాలు గుప్పిస్తూ నిరాశతో వెనుదిరిగారు వృద్ధులు.

బేతంచెర్ల: చంద్రబాబు నిర్వాకం మూలంగా పింఛన్ దారులకు నిరీక్షణ తప్పలేదు. ఉదయమే పెద్దఎత్తున వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆయా సచివాయాలు చేరుకోగా మధ్యాహ్నం తర్వాత పింఛన్ పంపిణీ ప్రారంభించారు సచివాలయ సిబ్బంది. దీంతో చాలా మంది లబ్ధిదారులకు పింఛన్ అందలేదు. బాబు తీరుపై అసహనం వ్యక్తం చేశారు పింఛన్ లబ్ధిదారులు.

డోన్ : ప్రభుత్వం అందించే పింఛన్లను ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలెంటీర్లను దూరం పెట్టింది మేమేనని టీడీపీ నాయకులు నిస్సిగ్గుగా ప్రకటించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. పింఛన్ కోసం తమను ఏడిపిస్తున్న చంద్రబాబు ఫలితం అనుభవిస్తారంటూ అవ్వతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతోపాటు వివిధ పింఛన్ లబ్ధిదారులు శాపనార్థాలు గుప్పిస్తున్నారు.

కొలిమిగుండ్ల: ప్రతి నెల ఒకటో తేదీనే ఠంచన్‌గా తెల్లవారు జామునే వలంటీర్లు తలుపు తట్టి పింఛన్ సొమ్మును అవ్వా,తాతలకు చిరునవ్వులతో అందిస్తుండేవారు. చంద్రబాబు కుట్రతో ఏప్రిల్ పింఛన్ సొమ్ము తీసుకునేందుకు లబ్ధిదారులు పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితర లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో గ్రామ సచివాలయాలకు చేరుకున్నారు. బాబు తీరును తప్పుపట్టారు. ఫలితం అనుభిస్తావంటూ శాపనార్థాలు పెట్టారు వృద్ధులు.

అవ్వాతాతలకు తప్పని తిప్పలు

కోవెలకుంట్ల: గత ఐదేళ్ల నుంచి వలంటీర్ ద్వారా ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారుజామునే ఠంచన్‌గా పింఛన్ అందుకుంటున్న అవ్వా తాతలకు ఈ నెల నుంచి పింఛన్ కష్టాలు మొదలయ్యాయి. వలంటీర్లపై మొదటి నుంచి అక్కసు వెల్లగక్కుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పండుటాకుల పింఛన్లపై కుట్ర అస్త్రం వదిలాడు. వలంటీర్లు పింఛన్లు పంచకూడదని నిమ్మగడ్డ రమేష్‌తో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయించాడు. దీంతో ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీ బాధ్యతలను వలంటీర్లకు తప్పించి గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించింది. బుధవారం నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 12 సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల పరిధిలో 278 మంది వలంటీర్లు పనిచేసేవారు. ప్రతి నెలా 6,104 మందికి పింఛన్లు అందజేస్తున్నారు వలంటీర్లు. పింఛన్ల పంపిణీ బాధ్యతలను తప్పించడంతో వృద్ధులు, వితంతులు, చేనేత, డప్పు, చర్మ కళాకార, తదితర పింఛన్లు పొందే లబ్ధిదారులు వారికి కేటాయించిన సచివాలయాలకు ఉదయమే వెళ్లారు. అక్కడ పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.

మా ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుంది



నీకు ఏమి ద్రోహం చేశామయ్యా చంద్రబాబు.. మమ్మల్ని ఇంతలా బాధిస్తున్నావు.. మా ఉసురు నీకు తప్పక తగులుతుంది. దాదాపు ఏడాదిన్నరగా పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉన్నాను. వలంటీర్ ద్వారా ప్రతి నెల 1వ తేదీన మా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ నగదును అందించేవారు. నీ రాజకీయ కుట్రల కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. మా ఉసురు తప్పక తగులుతుంది.

– అనకల అబ్బన్న, పింఛన్ లబ్ధిదారుడు, అవుకు

చంద్రబాబు కనికరం లేనివాడు



చంద్రబాబు నాయుడు మానవత్వం లేనివాడని నిరూపించుకున్నాడు. నేను ఓ వృద్ధుడిని. నోట మాట సరిగా రాదు. చెయ్యి పూర్తిగా వంకరపోయింది. మా తల్లికూడా వికలాంగురాలే...ఆమె నడవలేనిస్థితి. గతంలో పింఛన్ తీసుకునేందుకు నానా అగచాట్లు పడ్డాం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వచ్చాక ఆ తిప్పలు తప్పాయిలే అనుకుంటే మళ్లీ అదే దుస్థితి తీసుకొస్తున్నావ్. ఎందుకు మాపై ఇంత కక్ష్య సాధింపు.

– వెంకట సుబ్బయ్య, దివ్యాంగుడు, అవుకు

ఇంటి దగ్గర బాగుండేది



నేను ఉండేది జెండాపేట, రెండో సచివాలయం నుంచి పెన్షన్ అందుకుంటున్నాను. ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్ వచ్చి ఇంటి దగ్గర పింఛన్ ఇచ్చేవాడు. మా ఇంటి దగ్గర నుంచి ఒకటిన్నర కిలో మీటర్ల దూరంలో ఉన్న సచివాలయం దగ్గరకు వచ్చాను. చంద్రబాబు ఇలా చేయడం అన్యాయం. ఫలితం అనుభవిస్తాడు.

– మా బుసా, జెండా పేట, బేతంచెర్ల , పట్టణం

వృద్ధులకు ఇక్కట్లే



చంద్రబాబు తీరుతో వృద్ధులకు ఇక్కట్లు తప్పడం లేదు. మాలాంటి వారిని రాజకీయాలకు వాడుకోవడం సమంజసం కాదు. పింఛన్ కోసం గ్రామ సచివాలయం దగ్గరకు రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగానే వలంటీర్లతో ఇంటి దగ్గరే పంపిణీ చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– వెంకటప్ప నాయుడు, పింఛన్ దారుడు, బేతంచెర్ల

దుర్మార్గపు చర్య



నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్లపై టీడీపీ, జనసేన నాయకులు కక్ష కట్టడం దుర్మార్గపు చర్య. కన్న బిడ్డలే సరైన సమయానికి ముద్దన్నం పెట్టలేని ఈ కాలంలో చాలీచాలని వేతనంతో పనిచేసే వలంటీర్లు ప్రతి నెల 1వ తేదీన ఠంచన్‌గా పింఛన్ అందజేస్తుండటం చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకున్నారు. ఇలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం.

– కంబగిరి స్వామి, హెచ్ఆర్.పల్లె

పేదలపై పంతమా



అవసాన దశలో క్రమం తప్పకుండా ప్రభుత్వ పింఛన్ మొత్తాన్ని ఠంచన్‌గా అందజేస్తున్న వలంటీర్లపై టీడీపీ నాయకులు తలపెట్టిన పంతం ముమ్మాటికి పేదలపై తలపెట్టిందే. శరీరంలో సత్తువ కోల్పోయిన వృద్ధులు, అభాగ్యులు, అనాథలు, దివ్యాంగులను కన్నీళ్లు పెట్టించడం సబబు కాదు. మా ఉసురు టీడీపీకి ఖచ్చితంగా తగులుతుంది.

– హుసేన్ బీ, డోన్.

మా ఉసురు ఊరికే పోదు



సత్తువ నశించి అవయవాలు పనిచేయని మాలాంటి అభాగ్యులకు ఎందరికో ఠంచన్‌గా పింఛన్ అందుకోవడం మహానందం కలిగిస్తుండేది. ప్రతి నెల వైద్య ఖర్చుల కోసం ఎంతగానో ఉపయోగపడేది. పింఛన్ మొత్తాన్ని వలంటీర్లు అందజేయరాదని టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణం. మా ఉసురు తగిలి మా కన్నీళ్లకు టీడీపీ కొట్టుకుపోతుంది.

– మాబున్నీ, డోన్.

వృద్ధులను ఇబ్బంది పెట్టడం సరికాదు



వలంటీర్లపై ఫిర్యాదు చేసి పింఛన్ ఇవ్వకుండా చేశావు కదయ్యా. ప్రతి నెలా వలంటీర్ ఉదయాన్నే పింఛన్ ఇచ్చేవాడు. చంద్రబాబు కుట్ర వలన సచివాలయం దగ్గర పడిగాపులు పడుతున్నాం. మాలాంటి వృద్ధుల దగ్గరన నీ రాజకీయాలు. రానున్న ఎన్నికల్లో నీకు ఓటుతో బుద్ధి చెపుదాం చంద్రబాబు.

– కుల్లూరు నారాయణమ్మ, ముక్కమల్ల గ్రామం,

అభివృద్ధికి పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో కౌన్సిలర్ వెంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డోన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని మూడవసారి గెలిపించి హ్యాట్రిక్ కొట్టేందుకు సహకరించాలని కోరారు. చైర్మన్ వెంట వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్షరమణ, సుంకన్న, వెంకట్రాముడు, రైల్వే నాగేంద్ర, కోఆప్షన్ సభ్యుల కుమ్మరి రాజు, నాయకులు నాగిరెడ్డి, రవి, నాగేంద్ర, మిట్టా రవికుమార్, గేట్‌పైన రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం



ప్రచారం నిర్వహిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

బేతంచెర్ల: అన్ని వర్గాలకు సమన్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీల్లో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి బుగ్గన తనయుడు ఇంటింటికి వెళ్లి 5 ఏళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం కాలనీల్లో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుగ్గన అర్జున్‌రెడ్డి ప్రారంభించారు.

సిమెంట్ నగర్‌లో ప్రచారం

మండలంలోని సిమెంట్ నగర్‌లోని హెచ్ టైప్ కాలనీలో మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు యాకోబ్, మహేష్, ఓం శివ, శంకరయ్య, ఎంపీటీసీ శాంతి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్ ఖాజా, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు గూని నాగరాజు, మధు సూధన్ రెడ్డి, శేఖరయ్య,నాగేశ్వరరావు, వలీ బాషా, అజ్మతుల్లా, కృష్ణమూర్తి, గిడ్డయ్య, యోబ్ పాల్గొన్నారు.

డోన్ రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందాయని మంత్రి బుగ్గన కుమారుడు బుగ్గన అర్జున్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆవులదొడ్డిలో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉల్చాల మద్దిలేటి, గ్రామ నాయకులు బండికాటి రామకృష్ణుడు, డీలర్ మధు, గని మద్దిలేటి, డి.చిన్నమద్దిలేటి, పెద్దరాముడు, పెద్దమద్దిలేటి, కుమ్మరి పెద్ద హనుమన్న, చిన్న ఎల్లయ్య పాల్గొన్నారు.

బంగారం, వెండి ఆభరణాల సీజ్

బేతంచెర్ల: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి బంగారు , వెండి ఆభరణాలను తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రియతం రెడ్డి బుధవారం తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన నాగరాజు వద్ద నుంచి సుమారు 148.14 గ్రాముల బంగారం అభరణములు, రూ. 83 వేల నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని ఎన్నికల కమిషన్‌కు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

బుగ్గనను గెలిపించుకుందాం



గుట్టలపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: డోన్ నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని గెలిపించుకుందామని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని గుట్టలపల్లి గ్రామంలో బుధవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడచిన ఐదు సంవత్సరాలలో గుట్టలపల్లి గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, పర్వతం మధు, సోమశేఖర్, బొర్రా సంజీవ రెడ్డి, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలదుర్గం గ్రామంలో ఇంటింటి ప్రచారం

మండల పరిధిలోని జలదుర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ రసూల్, విద్యా కమిటీ చైర్మన్ గవ్వల నాగరాజు ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నెల్లూరి నాగరాజు, ఖలీల్, ఖాజా, చంద్రమౌళి, పసల మహబూబ్ బాషా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

బనగానపల్లె : రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఆర్ఓ కామేశ్వరరావు హెచ్చరించారు. బుధవారంస్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సోషల్‌మీడియా, విలేకరుల సమావేశాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయరాదన్నారు. వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడకూడదని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి

కొలిమిగుండ్ల: బెలుం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దూదేకుల పలుకూరు బాషాపై బుధవారం టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. పలుకూరు బాషా టీడీపీ నాయకుడు తపాలా హుశేని వీధిలోని బోరు రిపేరు చేయించి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మావీధిలోకే వచ్చి మమ్మల్ని తిట్టుకుంటూ పోతావా అంటూ టీడీపీ నాయకులు తపాలా హుశేని, అమడాల శ్రీను, దూదేకుల అహ్మద్, రాజారావుతో పాటు మొత్తం ఆరుగురు అడ్డగించి దూదేకుల పలుకూరు బాషాపై రాయితో దాడికి పాల్పడడంతో గాయపడ్డాడు. సీఐ గోపీనాథ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాషాను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

108 వాహనంలో ప్రసవించిన మహిళ

బేతంచెర్ల: మండల పరిధిలోని ముసలాయిచెర్వు గ్రామానికి చెందిన మనోహర్ భార్య మహాలక్ష్మికి బుధవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. సిబ్బంది నాగార్జున, ప్రకాశ్ ప్రసవం చేశారు. తల్లి బిడ్డను కర్నూలు ఆసుపత్రిలో చేర్పించారు.

కోట్ల, కేఈ .... డోన్‌కు చేసిందేమీ లేదు!



సమావేశంలో మాట్లాడుతున్న బాబుల్ రెడ్డి

బేతంచెర్ల: డోన్ నియోజకర్గానికి కోట్ల, కేఈ కుటుంబాలు దాదాపు నలభైఏళ్లు ప్రాతినిధ్యం వహించి కూడా చేసిందేమీ లేదని రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలీ, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, బీసీ నాయకుడు గూని నాగరాజు విమర్శించారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నాయకుడు సురేంద్ర నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 1వ తేదిన ముద్దవరంలో జరిగిన టీడీపీ కార్యక్రమంలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని రేకుల మంత్రి అని సంబోధించడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. డోన్ నియోజకర్గం వ్యాప్తంగా కుగ్రామాల్లో సైతం అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంటే కోట్ల కూడా ఏమి అభివృద్ధి జరగలేదంటూ ఆరోపించడం అన్యాయమన్నారు. మీతోపాటు కేఈ కుటుంబం నలభై ఏళ్లలో చేయని అభివృద్ధిని మంత్రి బుగ్గన ఐదేళ్లలోపే చేసి చూపారన్నారు. రేకులు(పఫ్‌షెట్) గురించి మాజీ కేంద్ర మంత్రి కోట్లకు తెలియకపోవడం చాలా బాధకరం అన్నారు. మంత్రి బుగ్గన ముందు చూపుతో విదేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి, వాటిని అధ్యయనం చేసి యూరోపియన్ శైలిలో నిర్మాణాలు చేపడితే కోట్ల వ్యంగంగా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. మీ స్వార్థ రాజకీయాలు మానుకొని మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడాలన్నారు. అభివృద్ధిపై డిబెట్ ఎక్కడా పెట్టినా వస్తామని సవాల్ విసిరారు. మీరందరూ కలిసి ఎకమైనా మంత్రి బుగ్గనను ఓడించ లేరని, ప్రజలు మా పక్షాన ఉన్నారనే విషయం ఇప్పటికైనా తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇబ్రహీమ్, నాయకులు సంధాని బాషా,అల్తాఫ్ పాల్గొన్నారు.

టీడీపీ కూటమికి బుద్ధి చెప్పండి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కర్రా గిరిజ, మేధాశ్రీరెడ్డి, ప్రణీతారెడ్డి

కోవెలకుంట్ల: కుట్రలు, కుతంత్రాలతో ప్రజల్లోకి వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోడలు మేధాశ్రీరెడ్డి, కుమార్తె ప్రణీతారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని సీతారామనగర్, టీటీడీ కల్యాణ మండపం, సాయినగర్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ షాజహాన్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, న్యాయ విభాగం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, శ్రీనివాసనాయక్, గువ్వల రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గజ్జెలరెడ్డి, పత్తి మనోహర్, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామ సచివాలయ పరిధిలో పని చేస్తున్న పది మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. బి.గోపి, సురేష్, ప్రేమిల, ప్రణీత్, ఓబులేసు, మధు సురేంద్ర, పురుషోత్తం, ఉషా రాణి, జయరాజు, వెంకటేశ్వర్లు సంజామలకు చేరుకుని ఎంపీడీఓ నాగకుమార్ రాజీనామ పత్రాలను అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లడుతూ...టీడీపీ నాయకులు పని కట్టుకుని తమపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. కరోనా కష్ట కాలంలో కుడా ప్రజలకు సేవ చేశామని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతామని వలంటీర్లు హెచ్చరించారు.

యనకండ్ల గ్రామ వలంటీర్ల....

బనగానపల్లె రూరల్ : మండలంలోని యనకండ్ల గ్రామ సచివాలయ పరిధిలోని 18 మంది వలంటీర్లు ముక్కుమడి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి చంద్ర ఓబులరెడ్డికి అందజేశారు. ఈ పంచాయతీలో మొత్తం 24 మంది వలంటీర్లు ఉన్నారు. మిగిలిన వారు కూడా రాజీనామా ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. స్వచ్ఛందగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై విషం కక్కుతున్న టీడీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో ఓటర్లే గుణపాఠం చెబుతారని ఈ సందర్భంగా రాజీనామా చేసిన వలంటీర్లు హెచ్చరించారు.